సాక్షి
మంచిర్యాల

శనివారం : 18 : జనవరి : 2025



'నవోదయ'కు సర్వం సిద్ధం
నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధమైంది. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. 5,191మంది విద్యార్థులు హాజరు కానున్నారు. IIలో▸



పలికితే పని చేస్తుంది!
వృద్ధులు, దివ్యాంగులకు ఉపయోగపడేలా పరికరాన్ని విద్యార్థి సాయిశోభిత్ రూపొందించాడు. ఈ పరికరంతో ఇంట్లోని టీవీ, ఏసీ, బల్బ్ ఆపరేటింగ్ చేయవచ్చు. IIలో▸

గరిష్టం/కనిష్టం
29.0 /16.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

అర్హులందరికీ పథకాలు



సమావేశానికి హాజరైన మంత్రి సీతక్క, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు

- పారదర్శకంగా అమలుకు చర్యలు
- రేషన్‌కార్డు సమస్యలు, ఎమ్మెల్యేల సూచనలు సీఎం దృష్టికి తీసుకెళ్తా..
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- నిర్మల్‌లో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం

నిర్మల్: ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులను ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదేశించారు. ఈనెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులపై నిర్మల్ కలెక్టరేట్ సమావేశమందిరంలో ఉమ్మడి జిల్లా స్థాయి ప్రణాళిక–కార్యాచరణపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇందులో నాలుగు జిల్లాల కలెక్టర్లు అభిలాష అభినవ్, రాజర్షిషా, కుమార్‌దీపక్, వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విఠల్, నిర్మల్, ఖానాపూర్, ముధోల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వెడ్మ బొజ్జుపటేల్, రామారావ్ పటేల్, పాయల శంకర్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఆ యా జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, ఇతరశాఖల అధి కారులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రికి నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల పూల మొక్కలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

పకడ్బందీగా అమలు చేయాలి..
రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న పథకాలను రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో గ్రామసభలు, పట్టణాల్లో వార్డుసభలు నిర్వహించి గుర్తించిన అర్హుల వివరాలు వెల్లడించాలన్నారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు కొత్త పథకాలపై లేవనెత్తిన పలు సందేహాలకు మంత్రి సమాధానాలిచ్చారు. రేషన్‌కార్డులతోపాటు ఇతర సందేహాలనూ సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. నిర్మల్ ఉత్సవాలను విజయంతంగా నిర్వహించినందుకు కలెక్టర్, అధికారులను మంత్రి అభినందించారు. సమావేశంలో ప్రధానంగా బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ఏజెన్సీ ఏరియాలో గిరిజనేతరులకూ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. భూములు ఉన్నా పట్టాలు లేని గిరిజనులకూ రైతుభరోసా అందించాలన్నారు. నిర్మల్, ముధోల్ ఎమ్మెల్యేలు డబుల్‌బెడ్రూం, ఇందిరమ్మ ఇళ్లపై సందేహాలు వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ రేషన్‌కార్డుల సర్వేలో చాలామంది ఉద్యోగుల పేర్లు ఉన్నాయని, అర్హులకు మాత్రం రాలేదని వాటిని సరిచేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధిహామీ కూలీలకు అందించే ఆత్మీయ భరోసా పట్టణ పేదలకూ అందించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని వారంతా కోరారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్మన్లు సమావేశంలో అడిగిన పలు ప్రశ్నలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సమాధానాలు చెప్పారు. సమావేశంలో రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను మంత్రి సీతక్క, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల మంత్రికి హెల్మెట్ అందించగా సీతక్క దానిని పెట్టుకున్నారు. సమావేశానికి తూర్పు జిల్లాల ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం గమనార్హం. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, శ్యామలాదేవి, దీపక్ తివారి, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్లు గండ్రత్ ఈశ్వర్, రాజురా సత్యం, గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్‌అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పక్కగా అమలు చేస్తాం..


జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు కోసం పక్కాగా ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నాం. ప్రతీ పథకానికి నోడల్ అధికారులను నియమించాం. ఎప్పటికప్పుడు సమీక్షలు చేపడుతున్నాం. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ఉండేలా చూస్తున్నాం.
– కుమార్ దీపక్, కలెక్టర్, మంచిర్యాల

నోటిఫైడ్ ఏరియాలో ఎలా..?


ప్రభుత్వం కొత్త పథకాలను మందమర్రి వంటి నోటిఫైడ్ ఏరియాలలో ఎలా ఇస్తారో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనేతర రైతులకూ రైతుభరోసా ఇవ్వాలి.
– దండె విఠల్, ఎమ్మెల్సీ

ఇళ్లస్థలాలు లేనివారికి ఎలా..


ఇందిరమ్మ ఇళ్లను ఇంటిస్థలాలు లేని పేదలకు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలి. కొత్త రేషన్ కార్డుల మంజూరుతోపాటు అన్ని పథకాలూ పారదర్శకంగా పేదలకు అందేలా చర్యలు చేపట్టాలి. మున్సిపాలిటీల పరిధిలోని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎలా ఇస్తారో తెలుపాలి.
– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నిర్మల్

ఏజెన్సీ పేదలకు న్యాయం చేయాలి..


సంక్షేమ పథకాల అమలులో ఏజెన్సీ ప్రాంతాల పేదలకు న్యాయం చేయాలి. క్షేత్రస్థాయి సర్వేలో రేషన్‌కార్డు రాని పేదలు చాలామంది ఉన్నారు. పట్టాలు లేని గిరిజనులకూ పథకాలు అందించాలి.
– వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్యే, ఖానాపూర్

పథకాల్లో స్పష్టత ఇవ్వాలి..


రైతుభరోసా ఎంత ఇస్తారు.. పెండింగ్‌లో ఉన్నవి ఇస్తారా.. అనేది స్పష్టం చేయాలి. ఎంపికైన డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలి. ఉపాధికోసం విదేశాలకు వెళ్లినవారికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలి.
– రామారావుపటేల్, ఎమ్మెల్యే, ముధోల్

భూసేకరణ చేస్తారా..?


ఇందిరమ్మ ఇళ్లు స్థలం లేని పేదలకు ఎలా ఇస్తారు.. వారి కోసం భూసేకరణ చేస్తారా..? మున్సిపాలిటీలలో పేదలను ఎలా గుర్తిస్తారో చెప్పాలి. తాంసి, తలమడుగు వంటి మండలాల్లో రాళ్లురప్పలతో ఉన్న భూముల్లో సాగుచేసే రైతులకూ రైతుభరోసా ఇవ్వాలి. రేషన్‌కార్డులు ఉంటేనే కేంద్ర పథకాలు అందుతాయన్న విషయం గుర్తించాలి.
– పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

గిరిజనేతరులకూ ఇవ్వాలి..


ఏజెన్సీ ఏరియాలో ఉన్న గిరిజనేతరులకూ ప్రభుత్వ పథకాలు అందించేలా చూడాలి. ఇంటిస్థలాలు లేని పేదలకు ముందుగా స్థలాలను అందించి, ఇందిరమ్మ పథకాన్ని అమలు చేయాలి. ఏజెన్సీ ఏరియాకు స్పెషల్ కోటా పెంచాలి.
– అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

న్యూస్‌రీల్

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీసీపీ, అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు విధిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో డీసీపీ భాస్కర్‌తో కలిసి రవాణాశాఖ అధికారులు రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రచార కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు, ఇతర వాహన చోదకులు సీట్‌బెల్ట్ ధరించాలని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం విస్తృత చర్యలు చేపడుతోందని, రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారుల పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఓ సంతోష్, ఎంవీఐలు రంజిత్‌రెడ్డి, కిషోర్‌చంద్రారెడ్డి, ఏఎంవీఐ సూర్యతేజ పాల్గొన్నారు.

గర్భిణులకు హెచ్‌ఐవీ పరీక్షలు
మంచిర్యాలటౌన్: గర్భిణులకు హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్ తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం జిల్లా నోడల్ పర్సన్ డాక్టర్ గరుడలక్ష్మీ, ఎయిడ్స్, లెప్రసి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్‌తో కలిసి డీఎంహెచ్‌వో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో దిశ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ సెంటినెల్ సర్వేలెన్స్ ప్లస్ 2025లో భాగంగా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఎంపిక చేసినట్లు తెలిపారు. దేశంలోని ఎంపిక చేసిన ఏఎన్‌సీ కేంద్రాల్లో మూడు నెలల వ్యవధిలో ప్రతీ రెండేళ్లకు ఒకసారి హెచ్‌ఐవీ, సిఫిలిస్, హైపటైటిస్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అందులో భాగంగానే ఈ నెల 1నుంచి మార్చి 31వరకు గర్భిణుల నమూనాలు సేకరిస్తామని, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 400 నమూనాల లక్ష్యం కాగా, 28మంది నుంచి సేకరించామని తెలిపారు.

బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ


బస్సు వద్ద ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల తిరుగు ప్రయాణంతో బస్టాండ్‌లో రద్దీ నెలకొంది. హైదరాబాద్ నుంచి పండుగకు ఉద్యోగులు, విద్యార్థులు స్వగ్రామాలకు వచ్చారు. మూడు రోజుల పండుగ అనంతరం శుక్రవారం తిరుగు ప్రయాణం అయ్యారు. మంచిర్యాల బస్‌స్టేషన్ ప్రయాణికుల రాకతో కళకళలాడింది. రోజువారీగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు 38 బస్సులు నడిపేవారు. పండుగతో బస్సుల్లో సీట్లకు ముందుస్తుగా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకున్నారు. బస్సుల సీట్లన్నీ నిండిపోయాయి. ఇది గమనించిన ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల సౌకర్యార్థం శుక్రవారం మరో ఏడు అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. శని, ఆదివారాలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు బస్సులు నడుపుతున్నట్లు మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్ తెలిపారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు
జన్నారం: అర్హులకు ప్రభుత్వ పథకాలతో లబ్ధి చేకూరుతుందని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం జన్నారం శివారులో సాగుకు యోగ్యం కాని భూములను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాలుగు పథకాలకు సంబంధించి సర్వే కొనసాగుతోందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జన్నారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్‌ఐ గంగారాజు, ఏవో సంగీత, ఏఈఓ త్రిసంధ్య, ఆర్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్టమైన భద్రత
- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్టమైన భద్రత ప్రమాణాలు పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ బ్యాంకు అధికారులకు సూచించారు. శుక్రవారం కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల బ్యాంకు అధికారులు, ఏసీపీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలతోపాటు సెక్యూరిటీ గార్డు, అలారం సిస్టం ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఏటీఎంలు, బ్యాంకుల్లో జరిగిన ఆర్థిక నేరాలను వివరిస్తూ ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు సలహాలు ఇచ్చారు. మంచిర్యాల జిల్లా పరిధిలో 109 బ్యాంకులు, 89 ఏటీఎంలు ఉన్నాయని, వాటి పరిధిలో పూర్తి స్థాయిలో భద్రత కరువైందని అన్నారు. సమావేశంలో బ్యాంకు సిబ్బంది, అదనపు డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏసీపీలు పాల్గొన్నారు.

తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే క్రిమినల్ కేసు
మంచిర్యాలక్రైం: ఎలాంటి పోలీసు కేసులు లేవని తప్పుడు అఫిడవిట్ సమర్పించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని సీపీ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొందరు పాస్‌పోర్ట్, ఉద్యోగ నియామకాలు, ఇతర దేశాలకు వెళ్లేందుకు, ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో పని చేయడానికి సదరు అధికారులు పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్(పీవీసీ), పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్(పీసీసీ) అడుగుతారని, దీనికోసం దరఖాస్తు చేసుకునే వారు కొందరు ఎలాంటి కేసులు లేవని క్లియరెన్స్ నిమిత్తం తప్పుడు అఫిడవిట్లు సమర్పించారని తెలిపారు. 20మందిని గుర్తించామని, వారిపై, నోటరీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'రేషన్' జాబితా రద్దుకు ధర్నా


వినతిపత్రం అందజేస్తున్న యువకులు

భీమారం: రేషన్‌కార్డుల జాబితాలో అక్రమాలు జరిగాయని, వెంటనే రద్దు చేయాలని యువకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. భీమారం గ్రామంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కోసం 182మందితో జాబితా ప్రకటించగా.. అనర్హులకే పట్టం కట్టారని ఆరోపించారు. ఆర్థికంగా ఉన్న కుటుంబాలతోపాటు రిటైర్డు ఉద్యోగుల పేర్లు జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ సదానందంకు వినతిపత్రం అందజేశారు. అనర్హులకు రేషన్‌కార్డులు ఎలా కేటాయిస్తారని ఆయనతో వాగ్వాదానికి దిగారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

టీచర్ల పరస్పర బదిలీలకు గ్రీన్‌సిగ్నల్
- ఇక టీచర్ల సర్టిఫికేట్ల తుది పరిశీలన
- హామీ పత్రాల స్వీకరణలో విద్యాశాఖ

మంచిర్యాలఅర్బన్: స్థానికతను కోల్పోయి ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న టీచర్ల పరస్పర బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మ్యూచువల్ బదిలీల కోసం ఉపాధ్యాయుల దరఖాస్తులను పరిశీలించి.. హామీపత్రాలు స్వీకరించి నివేదించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి డీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. పరస్పర బదిలీలకు అంగీకరపత్రాలను ఇద్దరు ఉపాధ్యాయులు పూర్తి వివరాలతో సంతకాలు చేసిన పత్రం, అండర్‌టేకింగ్ సర్టిఫికేట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న టీచర్ల హామీపత్రం, ధ్రువపత్రాల తుది పరిశీలన చేసి ఈ నెల 22లోపు నివేదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో జిల్లాలో ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో ఆయా టీచర్ల నుంచి అంగీకారపత్రాలు స్వీకరించే పనిలో నిమగ్నమయ్యారు.

మ్యూచువల్ వైపే మొగ్గు
జీవో 317 కారణంగా ఉపాధ్యాయులకు ఊరట కలిగించేందుకు ప్రభుత్వం తాజాగా స్పౌజ్, అనారోగ్యం, పరస్పర బదిలీలకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో మ్యూచువల్ బదిలీల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో తక్కువ ఖాళీల నేపథ్యంలో స్పౌజ్ ద్వారా బదిలీలు కోరే ఉపాధ్యాయులకు ఎక్కువ మందికి అవకాశం లేకుండా పోతోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ఎంతమేరకు ఖాళీలు ఉన్నాయో ఆ ఖాళీలు మాత్రమే బదిలీలు చేపట్టాలని నిర్ణయించారు. జిల్లాకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్ తత్సమాన కేటగిరీల ఉపాధ్యాయ ఖాళీలు 10లోపు ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, తత్సమాన కేటగిరీ టీచర్ల పోస్టులు 150వరకు ఉన్నాయి. ఈ లెక్కన అన్ని క్యాడర్ల టీచర్లు 100లోపు అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఖాళీ లేని నేపథ్యంలో చాలామంది టీచర్లు మ్యూచువల్ బదిలీల వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. పరస్పర బదిలీల కింద 50మందికి పైగా టీచర్లు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. జీవో 317 స్థానికతను కాకుండా సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని జిల్లాలు కేటాయించారు. 2022లో మార్చిలో పరస్పర బదిలీలకు అనుమతి ఇవ్వగా తాజాగా మరోసారి ఇచ్చారు. దీంతో ఖాళీలను బట్టి స్పౌజ్ కేటగిరీలో అవకాశం దొరకని పరిస్థితి ఉన్న టీచర్లు పరస్పర బదిలీకి ముందుకొస్తున్నారు. పదవీ విరమణ పొందేవారు ఏ జిల్లాకైనా వెళ్లేందుకు ముందు వరుసలో నిలుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పరస్పర బదిలీల టీచర్ల వ్యక్తిగత పూచి పత్రాలు, సర్టిఫికేట్ల పరిశీలన చేపట్టారు.

317బాధిత టీచర్లకు న్యాయం చేయాలి
317 జీవో బాధిత టీచర్లను గుర్తించి స్థానిక జిల్లాలకు కేటాయించాలి. ప్రభుత్వం వేసిన సబ్‌కమిటీ కాలయాపనకు పరిమితమైంది. గత ప్రభుత్వం ఏదైతే వెసులుబాటు కల్పించిందో ప్రస్తుత ప్రభుత్వం కూడా మ్యూచువల్, స్పౌజ్, మెడికల్ బదిలీలకు ప్రాధాన్యత ఇచ్చి 317 జీవో బాధితులను విస్మరించింది. తక్షణమే ప్రభుత్వం పునరాలోచించి బాధిత ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి.
– దూడ రాజనర్సుబాబు, 317 జీవో బాధితుల సంఘం గౌరవ అధ్యక్షుడు

కొందరికే అవకాశం
ప్రభుత్వం చేపట్టిన మ్యూచువల్, స్పౌజ్ బదిలీల వల్ల కొంతమంది టీచర్లకే అవకాశం కలుగుతుంది. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతుంది. మరోసారి సబ్ కమిటీని సమాయత్తం చేసి డిస్‌లొకేటెడ్, స్థానికత ప్రాతిపదికన ఎవరైతే జిల్లాలో మగ్గుతున్నారో వారిని తక్షణమే సొంత జిల్లాలకు పంపించాలి. ఉద్యోగ విరమణ వయస్సు పెంపు ఆలోచన విరమించుకుని రిటర్మెంట్ ఖాళీలను 317 జీవో బాధితులకు కేటాయించాలి.
– బందారి పోశం, 317 జీవో బాధిత టీచర్

అంగీకార పత్రాలు సమర్పించాలి
పరస్పర బదిలీలు 2024 కోసం దరఖాస్తు చేసుకున్న టీచర్లు అంగీకార పత్రాలు డీఈవో కార్యాలయంలో సంమర్పించాలి. జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ బదిలీ దరఖాస్తు చేసుకున్న టీచర్లు నూతనంగా పొందుపర్చిన నమూనాలో సంబంధిత డీడీవో సంతకం, ముద్రతో ఈ నెల 18న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలి. రెండు సెట్లు నిజ సేవా పుస్తకం(సర్వీసు బుక్)తో వెరిఫికేషన్ చేసుకుని అందజేయాలి.
– డీఈవో యాదయ్య

ఓసీసీలో 'గుర్తింపు' పోరు
- ఆరేళ్ల తర్వాత ఎన్నికలకు రంగం సిద్ధం
- 28న ఎన్నికల తేదీ ఖరారు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ(ఓసీసీ)లో గుర్తింపు సంఘం ఎన్నికల నగారా మోగనుంది. ఆరేళ్ల తర్వాత ఎన్నికల ప్రస్తావన రావడంతో కార్మికుల్లో ఆనందం నెలకొంది. శుక్రవారం ఆదిలాబాద్‌లో డెప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్(డీసీఎల్) వద్ద నిర్వహించిన సమావేశానికి నాలుగు యూనియన్ల నాయకులు హాజరయ్యారు. ఈ నెల 28న ఎన్నికల తేదీ, గుర్తులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహణ చేపట్టనున్నారు. రెండేళ్లకోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా పాలకుల తీరుతో వాయిదా పడుతూ వస్తున్నాయి. ఆరేళ్ల క్రితం ఎన్నికలు నిర్వహించగా.. పదవీ కాలం ముగిసి నాలుగేళ్లు గడుస్తోంది. ఎట్టకేలకు అధికారులు ఎన్నికలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కంపెనీలో పది యూనియన్లు ఉండగా.. ఐదు మాత్రమే గుర్తింపు ఎన్నికల్లో పోటీకి అర్హత సాధించాయి. మిగతా యూనియన్లు రికార్డులు సమర్పించకపోవడంతో అనర్హత జాబితాలో ఉన్నాయి. కాగా, గుర్తింపు సంఘం లేకపోవడంతో కార్మికుల సమస్యలు ఎక్కడివి అక్కడే ఉన్నాయని కార్మికులు వాపోతున్నారు.

ఎన్నికలు వద్దంటున్న యాజమాన్యం
ఎన్నికల నిర్వహణకు డీసీఎల్ ముందుకు రాగా.. ఓరియంట్ యాజమాన్యం ఇప్పట్లో ఎన్నికలు వద్దంటూ లేబర్ కమిషనర్‌కు లేఖ రాసింది. ప్రస్తుతం కంపెనీని ఆదాని గ్రూపు తీసుకున్నందున ఏర్పాట్లలో ఉన్నామని పేర్కొంది. కాగా, ఎన్నికలు నిర్వహించాలని ఓరియంట్ సిమెంటు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్‌రావు 216మందితో సంతకాలు సేకరించి లేఖ సమర్పించారు.

28న ఎన్నికల తేదీ ఖరారు
ఈ నెల 28న యూనియన్లతో సమావేశం నిర్వహించి ఎన్నికల తేదీ ప్రకటించనున్నారు. నాలుగు యూనియన్లు పోటీలో ఉంటే 8రోజులు, ఐదు పోటీలో ఉంటే 10రోజుల వ్యవధి ఇచ్చి తేదీ ఖరారు చేస్తారని సమాచారం. రోజు తప్పి రోజు ఎన్నికల ప్రచారానికి యూనియన్లకు సమయం కేటాయించాల్సి ఉండడంతో పది రోజుల తర్వాత అనువైన సమయం చూసి నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నారు.



డీసీఎల్‌తో సమావేశంలో నాయకులు

ఆదిలాబాద్ సమావేశానికి హాజరైన యూనియన్లు
కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి శుక్రవారం ఆదిలాబాద్‌లోని డీసీఎల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి నాలుగు యూనియన్ల ప్రతినిధులు, కార్మికులు హాజరయ్యారు. ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్‌లోకల్ యూనియన్, ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్, లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. ఓరియంట్ సిమెంట్ కార్మిక సంఘం నుంచి ఎవరూ హాజరు కాలేదు. ఓరియంట్ అధికారులు ఓటరు జాబితా సమర్పించగా.. మార్పులు, చేర్పులు, లోటుపాట్లు సరి చేసి ఈ నెల 28లోపు సమర్పించాలని లేబర్ కమిషనర్ సూచించారు.

గోదావరి జలాలతో తిరుగుపయనం
- కలమడుగుకు చేరుకున్న మెస్రం వంశీయులు
- హస్తల మడుగులో పూజలు

జన్నారం: ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ నాగోబా ఆలయ జాతరను పురస్కరించుకుని నాగదేవతను గోదావరి జలాలతో అభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతియేటా మెస్రం వంశీయులు జన్నారం మండలం కలమడుగు గోదావరి నది హస్తలమడుగు నుంచి నదీజలాలు తీసుకెళ్తారు. గోదావరి జలాల కోసం కేస్లాపూర్ నుంచి ఈ నెల 10న పాదయాత్రగా బయల్దేరిన మెస్రం వంశీయులు గురువారం రాత్రి జన్నారం మండలం నర్సింగపూర్ చేరుకుని బస చేశారు. శుక్రవారం ఉదయం 7గంటలకు కలమడుగు గోదావరి నదికి చేరుకున్నారు. హస్తలమడుగులో గోదావరి జలాలను తీసుకెళ్లే కలశం(ఝరి)ను శుభ్రం చేశారు. నదిలో స్నానాలు ఆచరించిన అనంతరం దంపుడు బియ్యం, ఇంటింటి నుంచి తీసుకొచ్చిన పప్పుతో భోజనం చేశారు. కలశంలో గోదావరి నీటిని నింపారు. కలశంను కర్రకు కట్టి పూజలు చేశారు. అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. 20న కేస్లాపూర్‌కు చేరుకుంటామని కటోడ హన్మంతరావు, వంశీయులు మారుతి, తిరుపతి తెలిపారు. స్థానిక నాయకుడు మెస్రం రాజుకుమార్ పాల్గొన్నారు.



గోదావరి జలాలు సేకరిస్తున్న మెస్రం వంశీయులు

క్లుప్తంగా

ఎన్‌ఎంఎంకు ఉపాధ్యాయుడి ఎంపిక


సంతోష్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: నూ తన విద్యావిధానం- 2020 అమలులో భాగంగా జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ మిషన్ ఆన్ మెంటరింగ్ సభ్యునిగా జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు ఎంపికయ్యారు. గుడిహత్నూర్ మండలం తోషం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసే సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత భేదోడ్కర్ సంతోష్‌కుమార్‌ను కేంద్ర విద్యాశాఖ ఎంపిక చేసింది. ఈ మేరకు ఎన్‌సీటీఈ-ఎన్‌ఎంఎం కన్వీనర్ దినేశ్ చతుర్వేది నుంచి ఇటీవల ఆయన మెయిల్ అందుకున్నారు. ఈ మిషన్‌లో భాగంగా సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు, బోధనలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై వివిధ రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా భేదోడ్కర్ సంతోష్‌కుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌సింగ్ తిలావత్, ఉపాధ్యాయులు అభినందించారు.

జీపు డ్రైవర్‌పై కేసు

ఆదిలాబాద్‌రూరల్: పరిమితికి మించి వాహనంలో ప్రయాణికులను తరలిస్తున్న జీపు డ్రైవర్ అజీజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పలు రూట్లలో ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. ఇందులో భాగంగా అనుకుంట సమీపంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అజీజ్ అనే డ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికులను జీపులో తరలిస్తుండగా పట్టుకున్నారు. జీపును సీజ్ చేసి అజీజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

లేగదూడపై చిరుత దాడి

సారంగపూర్: మండలంలోని దుప్యాతండా అటవీ ప్రాంతంలో శుక్రవారం మేతకు వెళ్లిన లేగదూడపై చిరుత దాడి చేసి హతమార్చింది. డీఆర్వో నజీర్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. దుప్యాతండాకు చెందిన జాదవ్ ప్రేమ్‌కుమార్ అనే రైతు తన ఆవులు, లేగదూడలను సమీప అటవీ ప్రాంతంలో మేతకు తరలించాడు. ఈక్రమంలో చిరుతపులి ఆవుల మందపై దాడిచేసి లేగదూడను హతమార్చింది. గమనించిన పశువుల కాపరులు కేకలు వేయడంతో అక్కడినుంచి చిరుతపులి పారిపోయింది. అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో డీఆర్వో నజీర్‌ఖాన్, ఎఫ్‌బీవోలు వెన్నెల, సుజాత ఘటనాస్థలానికి చేరుకున్నారు. లేగదూడ కళేబరాన్ని పరిశీలించి చిరుత పాదముద్రలు గుర్తించారు. అనంతరం సమీప పంటపొలాల్లో ఉన్న రైతులు, అటవీ ప్రాంతంలోని గ్రామాల ప్రజలను చిరుత సంచారంపై అప్రమత్తం చేశారు. చిరుతకు ఎలాంటి హాని తలపెట్టవద్దని, కంటపడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. మృతి చెందిన లేగదూడ యజమానికి పరిహారం అందేలా చూస్తామని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన గాడి లక్ష్మి, గొడ్డు చిన్న అమ్మాయికి చెందిన రేకుల ఇళ్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు ఆర్‌ఐ నర్సయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి, చిన్న అమ్మాయి వ్యవసాయ కూలీలు. శుక్రవారం ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. గంట తర్వాత ఇంట్లోంచి పొగలు రాగా స్థానికులు గమనించారు. తాళం పగులగొట్టి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో నిత్యావసరాలు, దుస్తులు, కూలర్, టీవీ, ఫ్యాన్ కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించామని ఆర్‌ఐ తెలిపారు.

‘నవోదయ’కు సర్వం సిద్ధం

- నేడు 24 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష
- పరీక్షకు 5,191మంది విద్యార్థులు
- గంట ముందే లోనికి అనుమతి
- హాల్‌టికెట్, ‘ఆధార్’ తప్పనిసరి


సిర్పూర్(టి)లోని పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ పార్వతి

ఆసిఫాబాద్‌రూరల్: జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 సెంటర్లలో 5,191 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షకు 220 మంది ఇన్విజిలేటర్లు, ప్రతీ సెంటర్‌కు ఒకరు సీఎల్‌వో, ఒకరు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఇవే పరీక్షాకేంద్రాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. 5,191 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం కంటే గంట ముందే విద్యార్థులను సెంటర్లలోకి అనుమతిస్తారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆరు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్‌లో రెండు సెంటర్లు ఏర్పాటు చేయగా, ఇందులో సెయింట్ మేరీ స్కూల్‌లో 158 మంది, తెలంగాణ మోడల్ స్కూల్ 192మంది పరీక్ష రాయనున్నారు. కాగజ్‌నగర్‌లో రెండు సెంటర్లు ఏర్పాటు చేయగా, ఇందులో జవహర్ నవోదయ స్కూల్‌లో 240 మంది, సెయింట్ క్లాయిట్ పాఠశాలలో 251 మంది పరీక్షకు హాజరవుతారు. సిర్పూర్ (టీ)లో రెండు సెంటర్లు ఏర్పాటు చేయగా, గిరిజన బాలుర గురుకులంలో 158 మంది, గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 150 మంది పరీక్షలు రాయనున్నారు. ఉట్నూర్‌లో లాజీ బాబా స్కూల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా 263 మంది హాజరు కానున్నారు. ఆదిలాబాద్‌లో మూడు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇందులో చౌర్య అకాడమీ (మావలా రోడ్డు)లో 240 మంది, లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో 192 మంది, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 204 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారు. బోథ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఒక కేంద్రం ఏర్పాటు చేయగా 271 మంది పరీక్షలు రాయన్నారు. నిర్మల్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఎస్‌టీ థామస్ ఉన్నత పాఠశాలలో 264 మంది, విజయ హైస్కూల్‌లో 272 మంది పరీక్షలకు హాజరవుతారు. భైంసాలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేయగా వాసవీ హైస్కూల్‌లో 240మంది, వేదం హైస్కూల్‌లో 240 మంది, అల్ఫోర్స్ హైస్కూల్‌లో 217 మంది, ఖానాపూర్ వాసవీ హైస్కూల్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా 246 మంది పరీక్ష రాయన్నారు. లక్సెట్టిపేటలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో ట్రినిటీ హైస్కూల్‌లో 192 మంది, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 196 మంది పరీక్షలకు హాజరవుతారు. మంచిర్యాలలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో క్యారిమెల్ హైస్కూల్‌లో 216 మంది, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 229 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. చెన్నూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయనుండగా 145 మంది, మందమర్రిలో తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయనుండగా 143 మంది పరీక్షలు రాయనున్నారు. బెల్లంపల్లిలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా సెయింట్ మేరీ హైస్కూల్‌లో 262 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

పరీక్షలకు ఇలా రావాలి

- హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డుతో వెంట తెచ్చుకోవాలి.
- పరీక్ష ప్యాడ్, బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్‌తో రావాలి.
- ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్‌కు అనుమతి లేదు.
- పరీక్ష సమయం కంటే గంట ముందే పరీక్షాకేంద్రంలోకి అనుమతిస్తారు.
- విద్యార్థులు గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలి.
- పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఉంటుంది.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం

జిల్లాలో నిర్వహించనున్న నవోదయ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. పరీక్ష రాసే విద్యార్థులు నిర్ణీత సమయానికంటే గంట ముందే సెంటర్‌కు రావాలి. హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలి.

– ఉదయ్‌బాబు, జిల్లా పరీక్షల నిర్వహణాధికారి

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమశాఖ, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 9వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతులు ఫిబ్రవరి 15నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. శిక్షణ నాలుగు నెలలు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బుక్స్ ఫండ్, ప్రతీనెల స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12నుంచి 14వరకు ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08732–221280 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పోటీ పరీక్షల శిక్షణకు..

రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ద్వారా మైనార్టీ అభ్యర్థులకు ఇస్తున్న గ్రూప్ 1, 2, 3, 4తో పాటు ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ పోటీ పరీక్షల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రాజలింగు ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల పాటు బేసిక్ ఫౌండేషన్ కోర్సును ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఫిబ్రవరి 15వ తేదీ లోపు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరీక్షకు అనుమతించాలని సైకిల్‌యాత్ర


సైకిల్‌యాత్ర చేస్తున్న సుమంత్

కైలాస్‌నగర్: తనకు యూపీఎస్‌సీ సీఎస్‌ఈ పరీక్ష రాసేందుకు అవకాశమివ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు చెందిన టీవీవీఎన్ కృష్ణ సుమంత్ అనే యువకుడు సైకిల్‌యాత్ర చేపట్టాడు. ఈ నెల 1న చెన్నై నుంచి ఢిల్లీలోని ముఖర్జీనగర్ వరకు చేపట్టిన ఆ యువకుడి సైకిల్‌యాత్ర శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020లో తనకు కరోనా పాజిటివ్ రావడంతో అప్పట్లో ఈ పరీక్షకు అధికారులు అనుమతించలేదని తెలిపాడు. పరీక్ష రాసేందుకు ప్రస్తుతం తన వయస్సు దాటిపోయిందని పేర్కొన్నాడు. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాటు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి కూడా విన్నవించినట్లు చెప్పాడు. తనకు ప్రస్తుతం 37 ఏళ్లు వచ్చాయని, తన లాంటి అభ్యర్థులకు వయస్సు సడలింపునిచ్చి పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే సైకిల్‌యాత్ర చేపట్టినట్లు తెలిపాడు. తన అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని న్యాయం చేస్తుందనే నమ్మకముందని వెల్లడించాడు.

పలికితే పని చేస్తుంది!

- వృద్ధులు, దివ్యాంగులకు ఉపయోగపడేలా రూపొందించిన ప్రాజెక్ట్
- వాయిస్‌తో పని చేసే పరికరాన్ని తయారు చేసిన సాయిశోభిత్
- జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక


ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తున్న సాయిశోభిత్ (ఫైల్)

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌కు చెందిన డీఏవీ జ్ఞానమందిర్ విద్యార్థి ఏదులపల్లి సాయిశోభిత్ వాక్స్ లక్స్ వాయిస్ కంట్రోల్ అసిస్టెంట్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి ఈనెల 20న పుదుచ్చేరిలో జరిగే జాతీయస్థాయి సైన్స్ ప్రదర్శనకు అర్హత సాధించాడు. వృద్ధులు, వికలాంగులకు ఉపయోగపడేలా వాయిస్ కమాండింగ్‌తో టీవీ, బల్బు, ఏసీతో పాటు ఇంట్లో వినియోగించే ఎలక్ట్రిక్ పరికరాల ఆపరేటింగ్ ప్రాజెక్ట్‌ను రూపొందించాడు. లేవలేని, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఉపయోగపడే పరికరం తయారు చేయాలని భావించాడు. పుస్తకాలు చదువుతూ ప్రాజెక్ట్‌ను రూపొందించాడు. ప్రస్తుతం ఇంటిలో చప్పట్లు కొడితే, రిమోట్, సెన్సార్‌ల ద్వారా వస్తువులు పని చేస్తున్నాయి. వాయిస్ కమాండ్‌తో పనిచేసే అలాక్స లాంటి అంశాలున్న పరికరం కావాలంటే రూ.లక్షలు వెచ్చించాలి. దీంతో తక్కువ ఖర్చుతో పరికరం తయారు చేయాలని సాయి శోభిత్ భావించాడు. రూ.1,610 ఖర్చు చేసి ఆర్డీనో మైక్రో కంట్రోలర్, రిలాక్స్ ఎలక్ట్రో మాగ్నటిక్ స్విచ్, హెచ్‌సీ 5 బ్లూటూత్ మాడ్యూల్, ఒక అడాప్టర్, సాకెట్, బల్బు, ఫ్యాన్, మినీ కాయిల్ వైర్స్ కొనుగోలు చేశాడు. వీటిని వినియోగించి పరికరం తయారు చేశాడు. ఇంటర్‌నెట్ లేకున్నా పని చేసే పరికరాన్ని రూపొందించాడు. దేవాపూర్ డీఏవీ జ్ఞానమందిర్ పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు మూడు ప్రాజెక్ట్‌లు ఎంపికైనట్లు శోభిత్ గైడ్ టీచర్, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తెలిపారు. వాయిస్ కంట్రోల్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ దక్షిణభారత (జాతీయ స్థాయి) పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో వృద్ధులు, దివ్యాంగులు వినియోగించేలా ఈ ప్రాజెక్ట్ ఉందని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నామని, శోభిత్ భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్ట్‌లు రూపొందించే అవకాశముందని పేర్కొన్నారు.

మరిన్ని ప్రాజెక్ట్‌లు తయారు చేస్తా

ప్రస్తుతం మనం ఇక్కడే ఉండి వస్తువులను వినియోగించుకునేలా ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించాను. భవిష్యత్‌లో ఇక్కడి నుంచే ఇతర దేశాల్లో ఉన్న వస్తువులు వినియోగించేలా మరో ప్రాజెక్ట్ తయారు చేస్తున్న. త్వరలోనే అది పూర్తి కానుంది. నాకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారముంది. భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్ట్‌లు తయారు చేసేందుకు ప్రయత్నిస్తా. భవిష్యత్‌లో ఐఐటీలో గ్రాడ్యుయేట్ చేయడం నా కోరిక. – సాయిశోభిత్

చికిత్స పొందుతూ మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వాట్ తాలుకా దుండా గ్రామానికి చెందిన తోటవార్ కేశవ్ (60) ఈ నెల 15న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు. పంట దిగుబడి రాక అప్పులు మిగలడంతో మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


శనగపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జైనథ్ మండలం పార్డి(బీ), పార్డి(కే), రామాయి గ్రామాల్లో శనగ, మొక్కజొన్న, జొన్న, కంది పంటల్లో శుక్రవారం క్షేత్ర సందర్శన నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు కే రాజశేఖర్, డాక్టర్ డీ మోహన్‌దాస్, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు జీ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ జీ అనిల్‌కుమార్ రైతులతో కలిసి ఆయా పంటల సాగుతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శనగపంటలో లద్దె పురుగు పచ్చపురుగులను నివారించేందుకు ఎమమెక్టిన్ బెంజోయేట్ ప్లస్ నోవల్యురన్‌ను ఎకరానికి 330 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న, జొన్న పంటల్లో కత్తెర పురుగు నివారణకు 3కేజీల కార్బొ ఫ్యూరాన్ గుళికలు, నాలుగు లింగాకర్షక బుట్టలు, రాత్రిపూట మంటలను వెలిగించాలని తెలిపారు. లామ్డాసైషలోత్రిన్ ప్లస్, క్లోరంథని లిప్రోల్ 80మిల్లీ లీటర్లు స్పైనిటోరం 180 మిల్లీ లీటర్ల సుడుల్లో పడేలా పిచికారీ చేయాలని వారు సూచించారు.

నాగోబా జాతర తైబజార్ వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఈ నెల 28వ తేదీన మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభించనున్న నాగోబా జాతర సందర్భంగా శుక్రవారం దర్బార్ హాల్‌లో దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు, మెస్రం వంశీయులు వేలం నిర్వహించారు. తైబజార్ నిర్వహణను రూ.7.26 లక్షలకు కేంద్రే అవదూత్ దక్కించుకున్నారు. జాతరలోని దుకాణ సముదాయాలతో పాటు ఆలయానికి విద్యుత్ సరఫరా బాధ్యతలను రూ.2.01లక్షలకు మరొకరు సొంతం చేసుకున్నారు. ప్యాలాలు, పుట్నాల అమ్మకపు బాధ్యతల ద్వారా రూ.50 వేలు, కొబ్బరి ముక్కల సేకరణ కాంట్రాక్ట్ ద్వారా రూ.2లక్షల ఆదాయం సమకూరింది. ఈసారి వేలం ద్వారా రూ.9.97లక్షల ఆదాయం వచ్చింది. ఇంకా వాహనాల పార్కింగ్, కొబ్బరి కాయల దుకాణాల ఏర్పాటుకు వేలం నిర్వహించాల్సి ఉందని దేవాదాయశాఖ ఈవో రాజమౌళి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, గ్రామస్తులు మెస్రం నాగ్‌నాథ్, తోడసం సాగర్, మెస్రం ఆనంద్‌రావ్, షేక్‌నాథ్, దేవాదాయశాఖ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ సమీపంలో ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలం కొల్లారి గ్రామానికి చెందిన ప్రభాకర్ ఆసిఫాబాద్ నుంచి గుడిహత్నూర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఇచ్చోడ మండలం బోరిగాం గ్రామానికి చెందిన తండ్రీకొడుకు రాంచంద్రారెడ్డి, నితేశ్‌రెడ్డి మరో ద్విచక్రవాహనంపై ఇంద్రవెల్లి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో హీరాపూర్ సమీపంలో ప్రధాన రహదారిపై ఎదురెదురుగా వీరి ద్విచక్రవాహనలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బోరిగాం గ్రామానికి చెందిన రాంచందర్‌రెడ్డి కాలు విరిగింది. అతని కొడుకు నితేశ్‌రెడ్డి, కొల్లారి గ్రామానికి చెందిన ప్రభాకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వెంటనే వీరిని చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

గంజాయి సాగు, విక్రయం కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి సాగుచేస్తూ విక్రయిస్తున్న వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టు ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చారు. జైనూర్ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ తిరుపతి తన సిబ్బందితో 2021 అక్టోబర్ 2న జైనూర్ మండలం కిషన్ నాయక్ తండా పరిధి చింతకర్ర వ్యవసాయ క్షేత్రంలో అదే గ్రామానికి చెందిన రాథోడ్ ఫూల్‌సింగ్ గంజాయి సాగు చేస్తుండగా పట్టుకున్నారు. జైనూర్ సీఐ హనూక్ అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ జగన్మోహన్‌రావ్ సాక్షులను కోర్టులో హాజరుపర్చగా నేరం చేసినట్లు రుజువైంది. దీంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, జైనూర్ సీఐ రమేశ్, ఎస్సై సాగర్, లైజనింగ్ అధికారి రాంసింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

లైంగికదాడికి పాల్పడ్డ కేసులో ఒకరికి రెండేళ్లు..

ఆదిలాబాద్‌టౌన్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళను గర్భవతిని చేసిన ఓ వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తు జిల్లా మొదటి అదనపు జడ్జి డాక్టర్ శివరాం ప్రసాద్ తీర్పు చెప్పినట్లు లైజన్ అధికారి ఎం.గంగాసింగ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీకి చెందిన మెరుగు పద్మ ఆర్టీసీ బస్టాండ్‌లో స్వీపర్‌గా పనిచేస్తోంది. అదే బస్టాండ్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసే మోచిగల్లికి చెందిన కాడే మనోజ్‌తో కొంతకాలంగా పరిచయముంది. మాయమాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చింది. గర్భాన్ని తొలగించుకోవాలని ఆమెపై దాడికి పాల్పడ్డాడు. అంతే కాకుండా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పొందిన కారు తీసుకున్నాడు. దీంతో ఆమె 2020 జూన్ 29న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి టూటౌన్ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. పీపీ షహీన్ సుల్తానా కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టి నేరం రుజువుచేయగా జడ్జి పైతీర్పు ఇచ్చినట్లు లైజన్ అధికారి వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌కు చెందిన భీమన్న కనకాపూర్ వైపు వెళ్తుండగా, నిర్మల్ నుంచి లక్ష్మణచాందకు వస్తున్న మండల కేంద్రానికి చెందిన ముత్యం కనకాపూర్ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భీమన్న తలకు గాయమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌లో భీమన్నను నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు.

పెన్‌గంగలో యువకుడి మృతదేహం లభ్యం

బేల: మండలంలోని మాంగ్రుడ్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగలో శుక్రవారం యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై దివ్యభారతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోగ్దూర్ గ్రామానికి చెందిన బట్టువార్ మహేందర్ (21) కొన్నాళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. గత నాలుగురోజులుగా అతడు కనబడటంలేదు. దీంతో కుటుంబ సభ్యులు గ్రామంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శుక్రవారం మాంగ్రుడ్ రెవెన్యూ గ్రామ శివారులోని పెనగంగలో అతడి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు అతడి తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

బోథ్: మండలంలోని కంటిగాం గ్రామ శివారులోని స్నానానికి వెళ్లి చెరువులో మునిగి యువకుడు మృతిచెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా డోంగ్రాగావ్ గ్రామానికి చెందిన బర్దవాల్ భారు తన భార్య నరు, ఇద్దరు కుమారులతో కంటిగాం గ్రామ శివారులోని చెరువు వద్ద మూడు రోజులుగా 300 ఆవులు, 400 గొర్రెలు, 100 మేకలను మేపుతున్నాడు. కాగా, భారు చిన్న కుమారుడు రామేశ్వర్ (19) శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సాబ్లె అమర్ సింగ్, పండరి అంకుష్‌తో కలిసి చెరువులో స్నానం చేయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో రామేశ్వర్ చెరువులో లోతైన ప్రాంతానికి వెళ్లి ఈత రాక మునిగిపోయాడు. గమనించిన అమర్ సింగ్, అంకుష్ కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టి రామేశ్వర్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి తండ్రి భారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాత కక్షలతో హత్యాయత్నం

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీగాం గ్రామ పంచాయతీకి చెందిన జిల్లపల్లి విగ్నేశ్‌పై అదే గ్రామానికి చెందిన ఐదుగురు పాత కక్షలతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న విగ్నేశ్‌పై అదే గ్రామానికి చెందిన జిల్లపల్లి నాని, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, వివేక్‌వర్ధన్, హర్షవర్ధన్ కర్రలతో దాడి చేశారు. అతడిని విచక్షణారహితంగా కొట్టి గాయపర్చారు. దీంతో విగ్నేష్ భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

యువతిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఓ యువతి ఇచ్చిన అప్పు తీర్చాలని కోరగా ఓ యువకుడు సర్జికల్ బ్లేడుతో దాడికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోనీ ఓ కాలనీలో దివ్య తన కుటుంబంతో కలిసి నివాసముంటోంది. అదే కాలనీకి చెందిన సంతోష్ అనే యువకుడి కుటుంబానికి ఆమె సుమారు రూ.20 లక్షల వరకు అప్పు ఇచ్చింది. ప్రతీరోజు ఈ విషయంపై ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో గురువారం దివ్య తల్లిపై సంతోష్ దాడికి పాల్పడగా తలకు గాయమైంది. ఆమెను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం దివ్య ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లే మార్గ మధ్యలో సంతోష్ సర్జికల్ బ్లేడ్‌తో ఆమెపై దాడి చేశాడు. దీంతో దివ్య మెడపై గాయాలు కాగా, వెంటనే ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. దివ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జైపూర్: మండలంలోని టేకుమట్ల శివారులోగల ఓ ఫాంహౌస్‌లో పేకాడుతున్న ఐదుగురిని శుక్రవారం మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై లచ్చన్న, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.20వేల నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మహిళను వేధించిన ఒకరిపై కేసు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ రూరల్ చిచ్‌ధరిఖానాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళను వేధించిన అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిచ్‌ధరిఖానాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంద్రవెల్లి మార్కెట్‌కు వచ్చి గురువారం సాయంత్రం తిరిగి ఆటోలో ఇంటికి వెళ్తోంది. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన వాగ్మారే తాతగత్ తన పక్కనే కూర్చొని చీర లాగడంతోపాటు తన శరీరాన్ని తాకి వేధించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.